
కల్యాణం జరిపిస్తున్న నిర్వాహకులు

### ఘనంగా రామలింగేశ్వరుడి
# కల్యాణం

కీసర, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): కీసరగుట్టలో శ్రీ రామలింగేశ్వర స్వామి కల్యాణం కనుల పండువగా జరిగింది. శ్రావణ మాసోత్సవంలో భాగంగా శ్రావణ శుద్ధ ఏకాదశీ సందర్భంగా మంగళవారం ఆలయ మహా మండపంలో ఉత్సవ మూర్తులకు కల్యాణ తంతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులతో పాటు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రామచందర్‌రావు

### 'స్థానిక' ఎన్నికల్లో
# సత్తా చాటుదాం

- బీఆర్ఎస్, కాంగ్రెస్ చేసిందేమీ లేదు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

వికారాబాద్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మంగళవారం వికారాబాద్‌లోని తేజ గార్డెన్స్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి కార్యకర్తల సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాల పాలన చూసిన ప్రజలు ప్రత్యామ్నాయం కోసం చూస్తున్నారని, పార్టీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి ప్రధాని మోదీ అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనుల గురించి వివరించాలని సూచించారు. ప్రజలు కూడా రాష్ట్రంలో బీజేపీని ప్రత్యామ్నాయంగా చూస్తున్నారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజార్టీ స్థానాల్లో బీజేపీ గెలిచే విధంగా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలన్నారు.

**వచ్చేది డబుల్ ఇంజిన్ సర్కారు**

తెలంగాణ రాష్ట్రానికి, జిల్లాకు బీఆర్ఎస్, కాంగ్రెస్ చేసిందేమీ లేదని ప్రజలకు వివరించాలని రాంచందర్‌రావు అన్నారు. మూసీ ప్రవహించే ఈ జిల్లాలో రైతులకు సాగునీరు, తాగునీరు అందడం లేదన్నారు. కురుస్తున్న వర్షాలతో రైతులు సాగు చేసిన పంటలు నీట మునిగి నష్టం జరిగిందని, రైతుల వద్దకు వెళ్లి వారికి జరిగిన నష్టం తెలుసుకుని జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ విజయకేతనం ఎగురవేసి రాష్ట్రంలో వచ్చేది డబుల్ ఇంజిన్ సర్కార్ అని చాటాలన్నారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కరణం ప్రహ్లాదరావు, కొకట్ మాధవరెడ్డి, శివరాజ్, సదానందరెడ్డి, నియోజకవర్గ బాధ్యులు వడ్ల నందు, నవీన్, బూనేటి కిరణ్‌కుమార్, వెన్న ఈశ్వరప్ప, మిట్ట పరమేశ్వర్‌రెడ్డి, రమేష్‌కుమార్ తదితరులు మాట్లాడుతూ, స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుతామన్నారు. పార్టీ కార్యకర్తలు బాధ్యతగా కష్టపడి పనిచేయాలని వారు కోరారు. ఈ సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు కేపీ రాజు, ఇంద్రకంటి రవికుమార్, విజయభాస్కర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, శివరాజ్, వికారాబాద్, తాండూరు, పరిగి నియోజకవర్గాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కాగా, ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ హరికృష్ణ, ఆయన అనుచరులు బీజేపీలో చేరారు.

### ఆధునిక హంగులతో
# పక్కా భవనాలు

## సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌లకు శాశ్వత నిర్మాణాలు

ఏళ్లుగా అద్దె భవనాల్లో కొనసాగుతున్న జిల్లా రిజిస్ట్రార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు సొంత భవనాల కల సాకారం కానుంది. దేశంలోనే అత్యధిక ఆదాయం ఆర్జించే ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని అనేక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు ఇప్పటికీ సొంత భవనాలు లేని విషయం తెలిసిందే. ఏటా రూ.వేల కోట్ల ఆదాయం ఆర్జిస్తున్నప్పటికీ ఈ కార్యాలయాలు అరకొర సౌకర్యాల నడుమ కొనసాగుతున్నాయి. వీటికి సొంత భవనాలు నిర్మిస్తామని గత ప్రభుత్వాలు హామీ ఇచ్చినా నేటికీ నెరవేరలేదు. ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ ఆధునిక హంగులతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నిర్మాణానికి చకచకా ఏర్పాట్లు చేస్తోంది. ఒకే చోట నాలుగైదు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండేలా సమీకృత భవన నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది.


బహిరంగ సభకు సిద్ధమవుతున్న వేదిక


సమీకృత భవన శంకుస్థాపనకు ఏర్పాటు చేస్తున్న శిలాఫలకం

- ఒకే చోట నాలుగైదు కార్యాలయాల ఏర్పాటు
- తొలి విడతగా రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో..
- గచ్చిబౌలిలో నేడు సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి): తొలి విడతగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాలోని 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల కోసం అత్యాధునిక హంగులతో 11 సమీకృత భవన నిర్మాణాలు చేపట్టనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో భాగంగా బుధవారం గచ్చిబౌలిలోని తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్(తాలిమ్) కార్యాలయ ఆవరణలో ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. ఒక్కో సమీకృత భవనంలో 10 నుంచి 15 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో

మిగతా 7వ పేజీలో...

**సమీకృత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నిర్మాణాలు ఇలా..**

- గచ్చిబౌలి(తాలిమ్ ఆవరణ): రంగారెడ్డి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంతోపాటు గండిపేట, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు
- కోహెడ: అబ్దుల్లాపూర్‌మెట్, పెద్ద అంబర్‌పేట, హయత్‌నగర్, వనస్థలిపురం
- మంఖాల్: మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, శంషాబాద్
- కండ్లకోయ: మేడ్చల్ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంతోపాటు కీసర, శామీర్‌పేట
- బోడుప్పల్: ఉప్పల్, నారపల్లి, కాప్రా, ఘట్‌కేసర్, మల్కాజిగిరి

## నిలిచిన ఇంటర్నెట్ సేవలు

- మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా కనెక్షన్లు కట్



మేడ్చల్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మేడ్చల్ - మల్కాజ్‌గిరి జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఇంటర్‌నెట్ సేవలు నిలిచిపోయాయి. విద్యుత్ స్తంభాలపై అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన కేబుల్స్‌తో పాటు ఇంటర్‌నెట్ వైర్లను విద్యుత్ సిబ్బంది మంగళవారం యుద్ధ ప్రాతిపదికన తొలగించారు. దీంతో ఎక్కడికక్కడ ఇంటర్‌నెట్ సేవలతో పాటు కేబుల్ టీవీ ప్రసారాలకు అంతరాయం కలిగింది. దీంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ముఖ్యంగా ఇంటర్నెట్ సరఫరా నిలిచిపోవడంతో పలు కార్యాలయాలు, దుకాణాదారులు ఇబ్బందులు పడ్డారు.

# ముసిరిన వాన


తాండూరు రూరల్: ఉధృతంగా ప్రవహిస్తున్న సంగెంకలాన్ వాగు

## పొంగి పొర్లుతున్న వాగులు


వికారాబాద్: అనంతగిరి ఘాట్ రోడ్డులో విరిగి పడ్డ చెట్లు

- నిలిచిన వాహనాల రాకపోకలు
- వేల ఎకరాల్లో నీట మునిగిన పంటలు
- మర్పల్లిలో 36.8మి.మీ వర్షపాతం నమోదు

వికారాబాద్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో ఆదివారం రాత్రి నుంచి మంగళవారం రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకలు ఉధృతంగా పొంగి ప్రవహిస్తున్నాయి. చెరువులు, కుంటలు మత్తళ్లు దూకుతున్నాయి. కురుస్తున్న భారీ వర్షాలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మర్పల్లి, మోమిన్‌పేట్, నవాబ్‌పేట్, పూడూరు, వికారాబాద్, కోట్‌పల్లి, బంట్వారం, పెద్దేముల్, యాలాల్, తాండూరు,

మిగతా 8వ పేజీలో...


మేడ్చల్ టౌన్: అలుగు పారుతున్న మేడ్చల్ పెద్ద చెరువు

**పొంగిన వాగులు**

7లో

**వర్షపాతం వివరాలు..**

గడిచిన 24 గంటల్లో వికారాబాద్ జిల్లా మర్పల్లిలో అత్యధికంగా 36.8మి.మీ, మోమిన్‌పేటలో 35.3మి.మీ, నవాబుపేటలో 25.0మి.మీ, పరిగిలో 21.3మి.మీ, పూడూరు మండలం పెద్దఉమ్మెంతాల్‌లో 23.3మి.మీ వర్షపాతం నమోదైంది. అలాగే మేడ్చల్ జిల్లా కూకట్‌పల్లి మండలం కూకట్‌పల్లిలోని ఈఎస్ఎస్ హెచ్ఎంటీ హిల్స్ హైదర్‌నగర్‌లో 46.8మి.మీ, బాచుపల్లిలో 40.5మి.మీ, రాజీవ్‌నగర్ గృహకల్ప వద్ద 40.8మి.మీ, కూకట్‌పల్లిలో 40.3మి.మీ, బాలానగర్‌లో 39.8మి.మీ, మల్కాజిగిరిలో 30.0మి.మీ వర్షపాతం నమోదైంది.



# అవినీతికి కేరాఫ్
# తాండూరు!

## బల్దియాలో అధికారుల ఇష్టారాజ్యం

- అడ్డూ అదుపు లేకుండా అక్రమాలు.. ఏసీబీ దాడులతో ఉలిక్కిపడ్డ అధికార గణం
- కార్యాలయం నుంచి పరార్.. ఫోన్ల స్విచ్ఛాఫ్.. ఏసీబీకి చిక్కిన సీనియర్ అసిస్టెంట్

తాండూరు, ఆగస్టు19 (ఆంధ్రజ్యోతి): అవినీతికి కేరాఫ్‌గా మారింది తాండూరు మున్సిపాలిటీ. కింది స్థాయి అధికారుల నుంచి కమిషనర్ వరకు అక్రమాలకు అడ్డు లేకుండా పోయింది. లంచాలు తీసుకుంటూ ఏసీబీకి చిక్కుతున్న అధికారులు ఓ వైపు.. నిధుల దుబారా, టెండర్లు లేకుండా మెటీరియల్ కొనుగోళ్లు, జేసీబీ మాయం, పాత మున్సిపాలిటీ భవనం పత్రాల అదృశ్యం, అక్రమ కట్టడాలు, పని చేయకుండా సిబ్బందికి వేతనాలు, వ్యర్థాల సేకరణ టెండర్లలో గోల్‌మాల్.. ఇలా ఎటు చూసినా అవినీతి కార్యక్రమాలే.. మున్సిపాలిటీలో జరుగుతున్న అనేక అక్రమాలను ఇప్పటికే 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చిన

మిగతా 8వ పేజీలో...

**వ్యర్థాల సేకరణలో భారీ నష్టం వచ్చేలా..**

వ్యర్థాల సేకరణలో కూడా మున్సిపాలిటీకి భారీ నష్టం వచ్చేలా చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వేలం వేసి మున్సిపాలిటీకి ఆదాయం రాకుండా చేశారు. మున్సిపాలిటీలో అతిపెద్ద జెండాను ఎగురవేసి అందుకోసం పెద్ద ఎత్తున నిధులు వృథా చేశారు. లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన స్వీపింగ్ మిషన్‌ను మున్సిపల్ భవనంలో వృథాగ పడేశారు. పాత మున్సిపాలిటీ భవనానికి సంబంధించి పత్రాలను కూడా మాయం చేశారు. ప్రస్తుతం ఆ భవనం ఎవరి పేరిట ఉన్నది అనే విషయం కూడా అధికారులు తెలియకుండా చేసి ఆ భవనాన్ని కూడా అన్యాక్రాంతం చేసే విధంగా ప్రయత్నాలు జరిగాయి. బల్దియాలో ఉన్న శానిటేషన్, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ విభాగాలన్నీ కూడా అవినీతితో కూరుకుపోయాయి. జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు కావాలంటే కూడా మున్సిపాలిటీలో చేతులు తడపాల్సిందే. అధికారులు మాముళ్ల వసూళ్ల కోసం తన అనుకూలమైన సిబ్బందిని నియమించుకున్నారు. తప్పుచేయనప్పుడు ఏసీబీ దాడులు జరుగుతున్న సమయంలో మున్సిపాలిటీలో ఉండకుండా వెళ్లిపోయిన కమిషనర్, ఇంజనీరింగ్ విభాగం అధికారులపై కూడా పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.


తాండూరు మున్సిపాలిటీ

## ఎక్కడి సమస్యలకు అక్కడే పరిష్కారం

- తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి
- గాంధీభవన్‌లో ప్రజాప్రతినిధుల ముఖాముఖి.. వినతుల స్వీకరణ


ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు,ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పాటైన నాటినుంచి ఎక్కడి సమస్యలే అక్కడే పరిష్కరిస్తున్నట్లు తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షులు మహేశ్ గౌడ్ సూచనలతో గాంధీ భవన్‌లో నిర్వహిస్తున్న ప్రజావాణి- ప్రజాప్రతినిధుల ముఖాముఖి కార్యక్రమంలో మంగళవారం ఆయన పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులను స్వీకరించి సంబంధిత అధికారులతో మాట్లాడారు అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వంపై పూర్తి నమ్మకం ఏర్పడిందని వివరించారు. గత బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు తమ సమస్యలు ఎక్కడ చెప్పుకోవాలో తెలియని పరిస్థితి ఉండేదని అన్నారు. ఏదైన సమస్య తలెత్తితే తిరిగి గాంధీభవన్ టీమ్‌ను సంప్రదించడానికి ప్రజలకు హెల్ప్‌లైన్ నంబర్స్ కూడా ఇస్తున్నట్లు తెలిపారు. భూ సమస్యలు, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల గురించి దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. కొన్ని సమస్యలు ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా ఉన్నాయని వాటిని సీఎం, సంబంధిత మంత్రుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.



## వైభవంగా శత రుద్రాభిషేకం

- లోక కల్యాణార్థం వికారాబాద్‌లో నిర్వహణ
- జంగమ సమాజం ఆధ్వర్యంలో ఏర్పాట్లు

6

## జిల్లా ఆస్పత్రికి సుస్తీ

- పైకప్పు నుంచి పేషంట్ల వార్డుల్లోకి వర్షపు నీరు

8

## ఆహారం కలుషితం కానివ్వొద్దు

- మేడ్చల్ అదనపు కలెక్టర్ రాధికా గుప్తా


స్టోర్ రూంను పరిశీలిస్తున్న రాధికా గుప్తా

కీసర, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అందించే ఆహారం కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ రాధికాగుప్తా సూచించారు. మంగళవారం అంకిరెడ్డిపల్లి బీసీ గురుకుల పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఆహారం కలుషితం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు ఆమె వంట గది, స్టోర్ రూంను పరిశీలించారు. ఆహార పదార్థలపై పురుగులు, ఈగలు, దోమలు పడకుండా జాగ్రత్తగా మూతలు ఏర్పాటు చేయాలన్నారు. గడువు ముగిసిన సామగ్రిని వాడరాదని సూచించారు. అదే విధంగా విద్యార్థులు కూడా తమ వ్యక్తిగత శుభ్రతతో పాటు, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. పాఠశాలలో లేదా వ్యక్తిగత సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం విద్యార్థుల సంఖ్య, భవనం అద్దె, వంటి వివరాల ప్రిన్సిపాల్ రాజమణిని అడిగి తెలుసుకున్నారు.

## గణనాథుల తరలింపులో ఇబ్బందులు


బ్రిడ్జి వద్ద నిలిచిన వినాయక విగ్రహం

ఘట్‌కేసర్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండుగను పురస్కరించుకొని వివిధ ప్రాంతాల వారు గణనాథుల విగ్రహాలను తరలిస్తున్నారు. పోచారం మున్సిపాలిటీ పరిధి యంనంపేట్ వద్ద, అన్నోజిగూడలో భారీ వినాయక విగ్రహాలను విక్రయిస్తున్నారు. కొనుగోలుదారులు ట్రాలీలను తెచ్చి విగ్రహాలను తరలిస్తున్నారు. అయితే భారీ గణనాథుల తరలింపులో నిర్వాహకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఘట్‌కేసర్‌లోని ఔటర్ రింగ్ రోడ్ చౌరస్తా బ్రిడ్జి వద్ద విగ్రహాలు బ్రిడ్జి ఎత్తుకు సమానంగా ఉండటంతో క్రేన్‌తో కిందికి దింపి బ్రిడ్జిని దాటిస్తున్నారు.



# ఘనంగా సుదర్శన హోమం


సుదర్శన హోమాన్ని నిర్వహిస్తున్న వేద పండితులు, పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బి.నర్సింహులు

షాద్‌నగర్‌అర్బన్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో కొనసాగుతున్న మహాకుంభ ప్రోక్షణ, పవిత్రోత్సవాల్లో భాగంగా మంగళవారం సుదర్శన హోమాన్ని నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు పలబట్ల బాల్‌రాజ్‌గుప్తా, పి.వెంకటసాయిశ్వర్‌రెడ్డి, జి.నర్సింహులు, కానుగు అంతయ్య, గంధం ఆనంద్, ఒగ్గు కిషోర్, కానుగు రాంభూపాల్, టి.దామోదర్‌రెడ్డి, నర్సింహులుగుప్తా, ఆర్.కృష్ణయ్య, ఈగ వెంకట్‌రాంరెడ్డి, శంకర్, శేఖర్ పాల్గొన్నారు.


యాగశాలకు విరాళమిస్తున్న శివశంకర్‌గౌడ్

### యాగశాల నిర్మాణానికి మాజీ ఎంపీపీ రూ.2.5లక్షల విరాళం

పెద్ద జానంపేట లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో యాగశాల నిర్మాణానికి కొత్తూర్ మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్ రెండున్నర లక్షల రూపాయల విరాళాన్ని ఇచ్చారు. వేంకటేశ్వరస్వామి ఆలయంలో కొనసాగుతున్న పవిత్రోత్సవంతో పాటు యాగశాల కోసం మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు సమక్షంలో విరాళం ఇచ్చారు. ఈ సందర్భంగా శివశంకర్‌గౌడ్‌ను నిర్వాహకులు సన్మానించి ఆశీర్వదించారు.

## సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే హామీ

● వర్షంలోనే వీర్లపల్లి వార్డు పర్యటన


వార్డులో పర్యటిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి):ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షం జల్లుల్లోనే ఎమ్మెల్యే, వీర్లపల్లి శంకర్ వార్డు పర్యటన చేపట్టారు. షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధి రెండో వార్డులో మంగళవారం ఎమ్మెల్యే పర్యటించి, ప్రజాసమస్యలను తెలుసుకున్నారు. కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించి, కరెంటు సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరారు. ప్రతి వార్డులో పర్యటిస్తూ సమస్యలను తెలుసుకుని, పరిశీలిస్తున్నానని ఎమ్మెల్యే న్నారు. ప్రజలు తన దృష్టికి తెచ్చిన, తాను గమనించిన సమస్యలన్నీ త్వరలోనే పరిష్కరిస్తానని చెప్పారు. పర్యటనలో మున్సిపల్ కమిషనర్ సునీత, ఏఎంసీ వైస్‌చైర్మన్ బాబర్‌ఖాన్, కాంగ్రెస్ నాయకులు కొంకళ్ల చెన్నయ్య, చెంది తిరుపతిరెడ్డి, సి.రాజేందర్‌రెడ్డి, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, అందె మోహన్, ఖదీర్, మురళీమోహన్, శ్రీనునాయక్, మజూద్‌ఖాన్, భగవాన్‌దాస్, మాధవులు పాల్గొన్నారు.

## అందుబాటులో సరిపడా యూరియా


గోదాంలో యూరియా నిల్వలను పరిశీలిస్తున్న ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి

ఆమనగల్లు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): వానకాలం పంటల సాగుకు యూరియా కొరత లేదని, రైతులు ఆందోళన చెందొద్దని కందుకూరు ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు.మోతాదుకు మించి రైతులు యూరియా వాడితే భూసారం దెబ్బతింటుందని పేర్కొన్నారు. ఆమనగల్లు మార్కెట్ యార్డ్ ఆవరణలోని మన గ్రోమోర్ సెంటర్ గోదాంను మంగళవారం ఆర్డీవో సందర్శించారు. ఆమనగల్లు ఏడీఏ శోభారాణితో కలిసి గోదాంలో యూరియా నిల్వలను, రికార్డులను పరిశీలించారు. దుకాణదారులు నిబంధనలకు లోబడి నడుచుకోవాలని అధికారులు సూచించారు. యూరియా కొరత సృష్టిస్తే చర్యలు తప్పవని ఆర్డీవో హెచ్చరించారు.

### ధాన్యం కొనుగోలు ప్రక్రియను

## సజావుగా నిర్వహించాలి


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

మేడ్చల్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాబోవు ఖరీఫ్ సీజన్‌లో రైతుల నుంచి సేకరించే వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి తెలిపారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ప్యాడీ యాక్షన్ ప్లాన్‌పై మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన 2025-26లో రైతుల నుంచి సేకరించే ధాన్యాన్ని సకాలంలో మిల్లర్లకు తరలించాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాలో 14 వద్ల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని, వాటికి అవసరమైన గన్నీ సంచుల సమీకరణ, తూకం యంత్రాలు, తేమ కొలిచే పరికరాలు, ధాన్యం తరలించేందుకు లారీలను అందుబాటులో ఉంచాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తాగునీటి వసతి కల్పించాలన్నారు. తేమశాతం 17లోపే ఉండాలని, తేమ ఉన్న ధాన్యం తీసుకురావడం వల్ల రైతులకు నష్టం వాటిల్లుతుందని తెలిపారు. ధాన్యం కొనుగోలు విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ సుగుణాబాయి, సివిల్ సప్లయీస్ శాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయ, మార్కెటింగ్, జిల్లా సహకార శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శత రుద్రాభిషేకం


మల్లికార్జునస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న ఆరుద్ర నక్షత్ర సహిత మహాన్యాస పూర్వక శత రుద్రాభిషేకం

వికారాబాద్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): లోక కల్యాణార్థం తెలంగాణ జంగమ సమాజం, జంగమ అర్చక పురోహిత సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని మల్లికార్జున భవనంలో ఆరుద్ర నక్షత్ర సహిత మహాన్యాస పూర్వక శతరుద్రాభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. వేద పండితులు, రాష్ట్ర ఆగమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మఠపతి సాంబశివశర్మ, బసవరాజస్వామి, మఠం శివానందం, పురాణం నాగయ్యస్వామి,మఠం చంద్రశేఖరస్వామి, మహంతయ్య స్వాముల నేతృత్వంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు శత రుద్రాభిషేకం కొనసాగింది. మల్లికార్జునస్వామికి డాక్టర్ ముద్ద దీప-భక్తవత్సలం దంపతులు, జ్యోతిప్రభ శాస్త్రోక్తంగా శతరుద్రాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో కిషన్‌నగర్ కాశీపీఠం వేద పాఠశాల నిర్వాహకులు సంగయ్యస్వామి, జ్ఞానేశ్వర్, సంగయ్యస్వామి, మందీపల్ రాజశేఖర్, శివశంకర్, విశ్వం పంతులు, రాజయ్యస్వామి, పులుమద్ది మల్లేశం, మహేశ్వర్, వీరేశలింగం, శ్రీకాంత్, మల్లేశం, ప్రభులింగం, మల్లికార్జున్, అనిల్, నరేశ్, వివిధ జిల్లాల జంగమ అర్చకులు 108మందికిపైగా పాల్గొన్నారు. హిందూధర్మం, శైవ వైశిష్టతపై పండితులు ప్రసంగించారు. మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, బీఆర్ఎస్ నాయకులు గోపాల్, చంద్రశేఖర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మల్లికార్జున్ తదితరులు స్వామి దర్శించుకున్నారు.


భక్తులకు ఆశీర్వచనాలు అందజేస్తున్న వేద పండితులు


బొంరాస్‌పేట్: మహంతిపూర్ వద్ద ప్రవహిస్తున్న కాకరవాణి ప్రాజెక్టు


అనంతగిరిలో జలపాతం


ఘట్‌కేసర్‌లో ప్రవహిస్తున్న ఎరిమల్లెవాగు

# పొంగిన వాగులు

## ముసురుతో ప్రజల ఇబ్బందులు

- నిండిన చెరువు, కుంటలు
- రోడ్లపై నీటి ప్రవాహంతో ఇక్కట్లు
- పలు చోట్ల విరిగిపడిన చెట్లు


ఘట్‌కేసర్ రూరల్ : ఎదులాబాద్ సమీపంలో ప్రవహిస్తున్న మూసీ నది

వికారాబాద్/ఘట్‌కేసర్/ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): కొద్ది రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో వాగులు, వంకలు పొంగుతున్నాయి. చెరువు, కుంటల్లోకి నీరు చేరింది. రోడ్లపై, కాలనీల్లో నీరు నిలిచింది. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ మోస్తరు వర్షం కురిసింది. ముసురుతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. విద్యార్థులు, ఉద్యోగులు, పనుల కోసం బయటకు వెళ్లే వారు వానలో తడుస్తూనే గమ్యస్థానాలకు చేరారు. వికారాబాద్ మండలం అనంతగిరి ఘాట్ రోడ్డుపై చెట్లు విరిగిపడ్డాయి. అటవీ, ఆర్‌అండ్‌బీ శాఖల అధికారులు, సిబ్బంది వాటిని తొలగింపజేశారు. అనంతగిరిలో జలపాతం కనువిందు చేస్తోంది. వాటిని చేసేందుకు పర్యాటకులు చేరుకుంటున్నారు. వర్షాలతో పత్తి, మొక్కజొన్న పంటలు నీరేస్తున్నాయని రైతులు ఆవేదన చెబుతున్నారు. ఘట్‌కేసర్‌లో సోమవారం రాత్రి భారీ వర్షం కురిసింది. రాత్రి 8గంటల నుంచి మంగళవారం ఉదయం 6గంటల వరకు 17.6మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. వర్షాలకు ఎరిమల్లెవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎదులాబాద్ లక్ష్మీనారాయణ అలుగెల్లింది. గాలి వీయడంతో రాత్రి నుంచి ఉదయం వరకు విద్యుత్ సరాఫరాలో అంతరాయం ఏర్పడింది. కురుస్తున్న భారీ వర్షాలకు మూసీనది ఉధృతంగా ప్రవహిస్తోంది. ఘట్కేసర్ మండలం ప్రతాప్‌సింగారం, కొర్రెముల, ఎదులాబాద్ సమీపంలో మూసీ ఉగ్రరూపం దాలుస్తోంది. కొర్రెముల, ప్రతాప్‌సింగారంలలో నీరు బ్రిడ్జికి తాకుతోంది. చెరువులు నిండాయి.


ప్రవహిస్తున్న సంగెంకలాన్ వాగు

## రోడ్లపై నీటి ఉధృతి

తాండూరు రూరల్/ధారూరు/పెద్దేముల్/బొంరాస్‌పేట్/కులకచర్ల: తాండూరు మండలం సంగెంకలాన్ వాగు మంగళవారం ఉధృతంగా ప్రవహించింది. ఈ మార్గం గుండా రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ధారూరు మండలంలో చెరువులు, వాగులు, కుంటలు పొంగిపొర్లాయి. ఎబ్బనూర్ చెరువు అలుగుపారుతోంది. అలాగే చింతకుంట, నాగారం, మోమిన్‌కుర్దు వాగులు పొంగాయి. ఇటీవల తెగిన గురుదోట్ల చెరువు కట్టకు తాత్కాలిక మరమ్మతులు చేశారు. నీటిపారుదల శాఖ అధికారులు చెరువుకట్టకు మట్టిపోయించి ఇసుక బస్తాలు పేర్చారు. నీరు పోకుండా కట్టడి చేశారు. పెద్దేముల్ మండలంలో మంగళవారం జోరు వాన కురిసింది. జైరాం తండా సమీప వాడుకలో వరదనీరు ప్రవహించింది. గంటపాటు ధారూర్ వాగుతండా-జైరాంతండాల మధ్య రాకపోకలు నిలిచాయి. నీరు నిలిచి పెసరపంట దెబ్బతింది. బొంరాస్‌పేట్ మండలంలో చెరువులు, వాగులు అలుగు పారుతున్నాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కాకరవాణి ప్రాజెక్టు ఉధృతంగా ప్రవహిస్తోంది. బొంరాస్‌పేట్-మహంతీపూర్‌ల మధ్య రాకపోకలు నిలిచాయి. కులకచర్ల మండలంలో చెరువులు అలుగుపారుతున్నాయి. తిరుమలాపూర్, అంతారం, కులకచర్ల, ముజాహిద్‌పూర్ చెరువులు అలుగెల్లుతున్నాయి. ముజాహిద్‌పూర్-అల్లాపూర్‌కు రోడ్డు కోతకు గురైంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై రమేశ్‌కుమార్ తెలిపారు. రాంనగర్ వద్ద కల్వర్టును పరిశీలించారు. ప్రజలు చెరువులు, వాగులు, కుంటల వద్దకు వెళ్లొద్దని సూచించారు.


ధారూరు: రోడ్డుపై పారుతున్న చింతకుంట వాగు

### వరద నివారణ చర్యలేవి?

బషీరాబాద్: లోతట్టు ప్రాంతాల ఇళ్లు, కాలనీల్లో వరద నీటితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితుల నివారణకు అధికారులు ముందస్తు ప్రణాళికలేవీ చేపట్టడం లేదు. మండలంలోని 10కిపైగా పంచాయతీలు, తండాల్లో ముంపు ప్రభావం ఉంది. బషీరాబాద్ రోడ్డులోని చున్నంబట్టి వద్ద ఇరుకైన కల్వర్టుతో రోడ్డుపై నీరు ప్రవహిస్తోంది. జీవన్గి ఎస్సీ కాలనీలో భారీగా నీరు చేరింది. మాసన్‌పల్లి పాఠశాల మైదానంలోకి రోడ్డుపై నుంచి వచ్చే నీరు చేరుతూ రోజుల నిలుస్తోంది. కొర్విచెడ్‌ఘనిలో ఇళ్లలోకి వరదొచ్చి ముంచెత్తుతోంది.


నందివాగు ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి, డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, సీఐ వెంకట్

### ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మోమిన్‌పేట్: వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కాస్లాబాద్ (నందివాగు ప్రాజెక్టు) వద్ద చెరువు నీటి మట్టం పెరిగి ప్రవహిస్తుండటంతో ఎస్పీ, డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, సీఐ వెంకట్‌లు పరిశీలించారు. వాగులు, చెరువులు, కుంటల్లో ప్రవాహ ఉధృతి ఉందని, వాటి వద్దకు ప్రజలు వెళ్లొద్దన్నారు. అత్యవసర సమయాల్లో డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు. వారితో ఏఎస్సైలు శ్రీనివాస్‌గౌడ్, వెంకటయ్య, సిబ్బంది ఉన్నారు.

### పలు గ్రామాల్లో కూలిన ఇళ్లు

మర్పల్లి/దోమ: వర్షాలకు నాని మర్పల్లి మండల పలు గ్రామాల్లో ఐదిళ్లు కూలాయి. తుమ్మలపల్లి, గుర్రంగట్టు తండా, పిల్లిగుండ్ల, గుండ్ల మర్పల్లి గ్రామాల్లో ఇళ్లు కూలాయి. ప్రభుత్వం తమకు ఆర్థికసాయం చేయాలని బాధితులు కోరారు. దోమ మండలంలో చెరువులు, కుంటలు అలుగు పారుతున్నాయి. బాసుపల్లి కొత్త చెరువు అలుగు కోత పడింది. అయినాపూర్, గండాల గ్రామాల్లో ఒక్కో ఇల్లు కూలింది.


దోమ: అయినాపూర్‌లో కూలిన ఇల్లు


మర్పల్లి మండలంలో కూలిన ఇల్లు


నీట మునిగిన పత్తి చేనును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి రాజరత్నం

### పొలాల్లో నిలిచిన నీటిని తొలగించాలి

ధారూరు: పొలాల్లో నిండిన వర్షపు నీటిని బయటకు తీసేయాలని జిల్లా వ్యవసాయ అధికారి రాజరత్నం రైతులకు సూచించారు. ధారూరులో నీటి మునిగిన పొలాలను మంగళవారం పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. నీట మునిగిన మొక్కల వేర్లు కుళ్లుతాయని చెప్పారు. ఈ సమయంలో పంటలపై కాపర్ ఆక్సీక్లోరైడ్ 3గ్రాముల మందును ప్రతీ లీటరు నీటిలో కలిపి మొక్కల మొదళ్లపై పిచికారి చేయాలని చెప్పారు. కంది చేనులో అయితే మెటాలాక్సిన్ 2గ్రాముల నీటిలో కలిపి నేల తడిచేటట్టు మొక్కల మొదళ్ల వద్ద పోయాలని చెప్పారు. పంటలకు నానో లిక్విడ్ యూరియా వాడుకోవాలన్నారు. రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా రైతు వేదికలో పాతమామిడి తోటల పునరుజ్జీవంపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో మాట్లాడారు. ఆయన వెంట ఏవోలు సూర్యప్రకాశ్, కరుణాకర్ రెడ్డి, శ్రావ్య ఉన్నారు.

## ఆధునిక హంగులతో పక్కా భవనాలు

(ఐదో పేజీ తరువాయి)

కార్యాలయాల నిర్మాణాలు చేపట్టనున్నారు. వెయిటింగ్ హాల్, తాగునీటి సదుపాయాలు, విశాలమైన పార్కింగ్ వంటి వసతులు ఉండేలా డిజైన్ రూపొందిస్తున్నారు. కార్పొరేట్ స్థాయిలో అత్యధునిక రీతిలో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయలను సీఎస్ఆర్ నిధులతో చేపట్టనున్నారు.

### మూడెకరాలు కేటాయింపు

గచ్చిబౌలిలో నిర్మించే సమీకృత భవన నిర్మాణం కోసం మూడెకరాల స్థలాన్ని ఇటీవల ప్రభుత్వం కేటాయించింది. గతంలో సర్వే నంబర్ 91/2లో తాలిమ్‌కు ప్రభుత్వం 15.20 ఎకరాల స్థలాన్ని కేటాయించగా ఇందులో కొంత ఖాళీగానే ఉంది. దీంతో ఇక్కడ మూడెకరాల స్థలాన్ని ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణానికి ప్రభుత్వం కేటాయించింది. గచ్చిబౌలిలో నిర్మించే సమీకృత భవన సముదాయంలో రంగారెడ్డి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంతోపాటు గండిపేట, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఏర్పాటు చేస్తారు. ఇలా మిగతా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు కూడా దశలవారీగా కార్పొరేట్ స్థాయిలో శాశ్వత భవనాలు నిర్మిస్తారు. వాస్తవానికి స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖకు రాష్ట్రంలోనే సింహభాగం ఆదాయం ఉమ్మడి జిల్లా నుంచే అందుతుంది. కానీ, ఇప్పటివరకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు సొంత భవనాలు లేక అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. ప్రభుత్వ తాజా నిర్ణయంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలన్నింటికీ సొంత భవనాలు సమకూరనున్నాయి. త్వరలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పునర్ వ్యవస్థీకరణ కూడా చేపట్టనున్నారు.


అవార్డును అందుకుంటున్న ఆసిఫ్ జానీ

### ఆసిఫ్ జానీకి 'భారత్‌కే అన్మోల్' అవార్డు

కందుకూరు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మహ్మద్‌నగర్(దెబ్బడగూడ)కు చెందిన ఎండీ ఆసిఫ్ జానీ(స్టార్ ఫిల్మ్ ఫ్యాక్టరీ నిర్మాత) భారత్‌కే అన్మోల్-2025 ఢిల్లీ ఎడిషన్ జాతీయ అవార్డును అందుకున్నారు. సోమవారం రాత్రి ఢిల్లీలో ఇండో-కెనడియన్ న్యాయవాది సయ్యద్ నూర్, భారత క్రికెట్ మాజీ కెప్టెన్ అజారుద్దీన్, కేంద్ర మాజీ మంత్రి అనురాగ్‌ఠాకూరుల నుంచి ఆసిఫ్ అవార్డును అందుకున్నారు.





## సీపీఎస్ రద్దు చేసే వరకు పోరాటం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మహేందర్‌రెడ్డి

తలకొండపల్లి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు సామల మహేందర్‌రెడ్డి అన్నారు. సీపీఎస్‌ను రద్దుచేసి పాత ఓపీఎస్‌ను పునరుద్ధరించే వరకు పీఆర్‌టీయు పోరాటం కొనసాగిస్తుందన్నారు. తలకొండపల్లి మండలంలో మంగళవారం ఆయన పర్యటించారు. పాఠశాలలను సందర్శించి పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదును ప్రారంభించారు. మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రభుత్వ విద్యారంగ బలోపేతం, టీచర్ల సమస్యల పరిష్కారానికి పీఆర్‌టీయు రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. సీపీఎస్ రద్దు కోరుతూ సెప్టెంబరు 1న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద మహాధర్నా చేస్తామని తెలిపారు. పాఠశాలల్లో వసతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ మండల అధ్యక్షుడు రాజేశ్వర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్, కడ్తాల మండల అధ్యక్షురాలు పద్మావతి, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, జ్యోతి, చంద్రశేఖర్, వెంకటేశ్, ముత్తయ్య, సుదర్శన్, రవి, ప్రసాద్, టీచర్లు పాల్గొన్నారు.

### ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలుపుకోవాలి

ఆదిభట్ల: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలుపుకొని సీపీఎస్‌ను రద్దుచేయాలని పీఆర్‌టీయూ రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షుడు గోవర్ధన్‌యాదవ్ డిమాండ్ చేశారు. సెప్టెంబరు 1న తలపెట్టిన మహాధర్నా పోస్టర్‌ను ఆదిభట్ల పరిధి బొంగ్లూర్ మోడల్ స్కూల్‌లో ఆవిష్కరించారు. తాము అధికారం లోకొస్తే సీపీఎస్‌ను రద్దుచేస్తామని ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ హామీ ఇచ్చిందన్నారు. ఓపీఎస్ సాధన కోసం సెప్టెంబరు 1న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద జరిగే నిర్వహించే మహాధర్నాలో ఉపాధ్యాయులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ మండలాధ్యక్షుడు పరమేశ్, కార్యదర్శి చంద్రశేఖర్, రాములు, టీచర్లు అమరావతి, కేదార్నాథ్, రామ్మోహన్, తిరుపతి పాల్గొన్నారు.

## పీసీసీ చీఫ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక

బషీరాబాద్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎక్మాయి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు మంగళవారం పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డిల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మాజీ సర్పంచ్ భర్త శ్యామప్ప, మరో 100మంది బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు వాహనాల్లో హైదరాబాద్‌లోని గాంధీభవన్‌కు చేరుకున్నారు. ప్రజలతో ప్రజా ప్రతినిధుల ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి నేతృత్వంలో మహేష్‌కుమార్‌గౌడ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ కల్వ సుజాత, నవాంద్గీ సొసైటీ వైస్‌ఛైర్మన్ అజయ్‌ప్రసాద్, పార్టీ మండలాధ్యక్షుడు కలాల్ నర్సింహులుగౌడ్, బి.శంకరప్ప, సాయిరెడ్డి, దుశ్యంత్‌రెడ్డి, మంజునాథ్, అర్జున్ పాల్గొన్నారు.


కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న ఎక్మాయి బీఆర్ఎస్ కార్యకర్తలు

## 'ప్రవాస్ యోజన'ను విజయవంతం చేయాలి

చేవెళ్ల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఇచ్చిన పిలుపు మేరకు ప్రవాస్ యోజన(పల్లె పల్లెకూ బీజేపీ) కార్యక్రమాన్ని ఈనెల 21న చేవెళ్ల మండలంలో ప్రారంభిస్తామని బీజేపీ మండల అధ్యక్షుడు మున్నూర్ శ్రీకాంత్, చేవెళ్ల పట్టణ అధ్యక్షుడు అత్తెల్లి అనంతరెడ్డి తెలిపారు. మంగళవారం చేవెళ్ల పట్టణ కేంద్రంలో బీజేపీ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని చన్వెల్లిలో నిర్వహించే ప్రవాస్ యోజనకార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు హాజరై ప్రారంభిస్తారని పేర్కొన్నారు. అనంతరం గ్రామ రైతులతో సమావేశం నిర్వహిస్తారన్నారు. 22న ఉదయం ఆలూర్ గ్రామంలో మహిళలతో సమావేశమవుతారు. మధ్యాహ్నం 3గంటలకు ఖానాపూర్ గేట్ వద్ద యువ సమ్మేళనం ఉంటుందని, బీజేపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు డాక్టర్ మల్గారి వైభవ్‌రెడ్డి, సామ రవీందర్‌రెడ్డి, దేవుని శర్వలింగం, వెంకట్‌రెడ్డి, ఇంద్రసేనా రెడ్డి, అశోక్, సత్యనారాయణ, శ్రీకాంత్‌రెడ్డి, తదితరులున్నారు.

## అర్హులందరికీ రేషన్ కార్డులు ఇవ్వండి


వ్యవసాయాధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): పేదలందరికీ రేషన్‌కార్డులు అందేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థల ఛైర్మన్ వీర్లపల్లి శంకర్ ఆదేశించారు. షాద్‌నగర్ ఆర్డీవో ఆఫీసులో మంగళవారం అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డి, ఆర్డీవో సరిత, ఇతర అధికారులతో సమీక్ష నిర్వహించారు. దరఖాస్తుల పరిశీలన పూర్తిచేసి రేషన్ కార్డులు జారీ చేయాలని ఆదేశించారు. త్వరలో ముఖ్యమంత్రి జిల్లా పర్యటన ఉంటుందని, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల పరిష్కార వేగాన్ని పెంచాలని కోరారు. క్యాంపు కార్యాలయంలో వ్యవసాయ శాఖ అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్నదాతలకు అండగా ఉండి వారి ఆర్థికాభివృద్ధికి కృషిచేయాలని ఆదేశించారు. సబ్సిడీ వ్యవసాయ యంత్రాలు, పనిముట్లు ఎన్నొచ్చాయని అడిగారు. వాటిని అర్హత, అవసరం ఉన్న రైతులకు మాత్రమే ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ రమాదేవి, ఏవోలు నిశాంత్‌కుమార్, శోభారాణి పాల్గొన్నారు.

## 108 అంబులెన్స్‌ను జిల్లా అధికారుల తనిఖీ



తనిఖీలో జిల్లా ఉప వైద్యాధికారి సత్యవతి

కీసర, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కీసరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని 108 అంబులెన్స్‌ను జిల్లా ఉపవైద్యాధికారి సత్యవతి తనిఖీ చేశారు. రాష్ట్ర కమిషన్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ వారి ఆదేశానుసారం అధికారులు అంబులెన్స్‌ను తనిఖీ చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా అంబులెన్స్‌లో గుండె, శ్వాసకు సంబంధించిన పరికరాలు సక్రమంగా పని చేస్తున్నాయా? అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సేకరించిన వివరాల నివేదికను ఉన్నతాధికారులకు తెలియజేస్తామని సత్యవతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి మనూజారెడ్డి, 108 సిబ్బంది రవి, రాంబాబు, నాగేందర్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

## పోలెపల్లి వాసికి పీహెచ్‌డీ పట్టా



పీహెచ్‌డీ పట్టాతో నర్సమ్మ

దుద్యాల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పోలెపల్లికి చెందిన నర్సమ్మ హిందీలో పీహెచ్‌డీ పట్టా పొందింది. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన 84వ స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ శర్మ, ఇస్రో చైర్మన్ డాక్టర్ నారాయణన్ చేతుల మీదుగా ఆమెకు పీహెచ్‌డీ పట్టా అందుకుంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెట్టుపల్లి తండా కేజీబీవీ పాఠశాలలో హిందీ ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తూ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 'దళిత సాహిత్యం' అనే అంశంపై పరిశోధనలు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా తోటి ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఆమెను అభినందించారు.

## కాసాని జ్ఞానేశ్వర్‌ను కలిసిన నాయకులు


కాసాని జ్ఞానేశ్వర్‌తో ముదిరాజ్ సంఘం నాయకులు

కొడంగల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్సీ జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ కాసాని జ్ఞానేశ్వర్‌ను ముదిరాజ్ సంఘం కొడంగల్ నియోజకవర్గ నాయకులు మంగళవారం హైదరాబాద్‌లో కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు నర్సింహులు, వేణుగోపాల్, రాములు, అంజయ్య, వంచర్ల గోపాల్, బస్వరాజ్‌యాదవ్, సాయిలు, రవి, రాజు తదితరులు పాల్గొన్నారు.

## బీసీ హాస్టల్ ప్రహరీ కబ్జాకు గురైతే ఊరుకోం


తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న బీఆర్ఎస్ నాయకులు

దౌల్తాబాద్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బీసీ హస్టల్ ప్రహరీ కబ్జాకు గురైతే ఊరుకోబోమని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. బాలుర వసతిగృహం ప్రహరీ నిర్మాణ పనులు పాత పునాది కంపౌండ్‌పై కాకుండా తగ్గించి కట్టి మిగతా ఖాళీస్థలంలో కబ్జాకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈమేరకు మంగళవారం మండల కేంద్రంలో తహసీల్దార్ గాయత్రికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మహిపాల్, భీములు, పకీరప్ప తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి సత్కారం

పూడూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్‌రావు ర్యాలీ పూడూరు మండలం మీదుగా కొనసాగింది. మంగళవాంకకం అంగడిచిట్టెంపల్లి గేటు వద్ద బీజేపీ ర్యాలీ రాగా సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యులు, ఓబీసీ మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మల్లేష్ పటేల్, మండల అధ్యక్షుడు తుంపల్లి రాఘవేందర్‌లు రాంచందర్‌రావును శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాశేఖర్ రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, సదానందరెడ్డి, శరత్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఆలయ అభివృద్ధికి కృషి

తాండూరు రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): వీరారెడ్డిపల్లి శివారులోని పురాతన వీరభద్రేశ్వరస్వామి ఆలయం అభివృద్ధికి కృషి చేస్తామని ఆలయ కమిటీ సభ్యులు అన్నారు. సారంగధర శెట్టి రామలక్ష్మమ్మ, జొన్నల బస్వరాజ్, సుజాత, జొన్నల వినోద్‌కుమార్, శివజ్యోతి, రుషికేష్‌ల సహకారంతో నూతనంగా నిర్మించిన ఆలయ గదులు, వంట గది, కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఆలయకమిటీ ప్రతినిధులు గదుల నిర్మాణానికి కృషిచేసిన దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు బస్వరాజ్, శివకుమార్, వినోద్‌కుమార్, పురుషోత్తం రెడ్డి, శ్రవణ్‌కుమార్, వీరేశం, రంజిత్‌కుమార్, వీరయ్యస్వామి, జితేందర్‌రెడ్డి, నారాయణ పాల్గొన్నారు.



# జిల్లా ఆస్పత్రికి సుస్తీ!

- నిర్మించి పాతికేళ్లు కాకుండానే శిథిలావస్థకు చేరిన వైనం
- పైకప్పు నుంచి పేషెంట్ల వార్డుల్లోకి వర్షపు నీరు


తాండూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి


ఆస్పత్రిలో భవనంలోకి వచ్చిన వర్షపునీరు

తాండూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రెండు సార్లు కాయకల్ప అవార్డులు పొంది, జనరల్ ఆస్పత్రిగా మారబోతున్న జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి సుస్తీ చేసింది. 200పడకల ఆస్పత్రి ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. పేషంట్ల వార్డుల్లోకి వర్షపునీరు వచ్చి రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 2012 ఆగస్టు 1న 200 పడకలతో ప్రారంభమైన ఈ ఆస్పత్రికి ప్రతీరోజు 800మంది వరకు ఓపీ పెషెంట్లు, 200మంది ఇన్ పెషెంట్లు వస్తుంటారు. ప్రస్తుతం ఈ భవనం పురాతనం కావడంతో పాటు భవన పెచ్చులూడిపోతున్నాయి. దీంతో పాటు పైనుంచి నీరు పేషెంట్ల బెడ్ల పైకి, హాల్‌లోకి వర్షపు నీరు వస్తున్నాయి. భవనం ప్రమాదభరితంగా ఉందని ఎప్పుడు కూలుతుందో తెలియక భయభ్రాంతులతో గడుపుతున్నామని అటు పేషెంట్లు, వైద్య సిబ్బంది పేర్కొంటున్నారు. వర్షపు నీరంతా పేషెంట్లు ఉన్న వార్డులోకి వస్తున్నాయని వాపోతున్నారు. ఆస్పత్రి ప్రధాన గేటు ఎదుటనే డ్రైనేజీ పొంగిపొర్లి రోడ్డుపై ప్రవహిస్తున్నది.


పేషెంట్ల బెడ్‌పై పడిన వర్షపునీరు

## సాంకేతిక రంగంలో సవాళ్లను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలి

మేడ్చల్ టౌన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగంలో చోటు చేసుకుంటున్న కొత్త సవాళ్లను ఎదుర్కోవటానికి విద్యార్థులు సిద్ధంగా ఉండాలని మైండ్ బీస్ వ్యవస్థాపకులు ఆదిరాజు రఘురామ్ అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడ నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో శతకోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు సమాజానికి అవసరమయ్యే నూతన ఆవిష్కరణలు కనుగొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలింగ్ సైకాలజిస్ట్ డాక్టర్ చాముండేశ్వరి, పాత్ క్రియేటర్ మేనేజింగ్ డైరెక్టర్ ఆశీష్, కళాశాల చైర్మన్ నర్సింహారెడ్డి, కార్యదర్శి త్రిశూల్‌రెడ్డి, కోశాధికారి త్రిలోక్‌రెడ్డి పాల్గొన్నారు.


విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్న మైండ్ బీస్ వ్యవస్థాపకులు ఆదిరాజు రఘురామ్

# అవినీతికి కేరాఫ్ 'తాండూరు'!

(ఐదో పేజీ తరువాయి)

విషయం తెలిసిందే. ఇక్కడ అక్రమాలపై పలువురు స్థానికులు హైకోర్టు వరకు వెళ్లారు. కలెక్టర్, డీఎంఎ(డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్)లో కూడా ఫిర్యాదు చేశారు.

### మామూళ్లతో పన్ను కుదింపు

కాగా, మున్సిపాలిటీలో మంగళవారం జరిగిన ఏసీబీ దాడులతో ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఈ దాడులతో మున్సిపల్ కమిషనర్‌తో సహా పలువురు అధికారులు, సిబ్బంది మున్సిపాలిటీ కార్యాలయాన్ని వదిలి ఫోన్‌లు స్విచ్ఛాఫ్ చేసుకొని పత్తా లేకుండా పోయారు. ఈ క్రమంలోనే సీనియర్ అసిస్టెంట్(ఆర్ఐ) రమేశ్ రూ.15 వేలు లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడాడు. అలాగే గతంలో తాండూరు పట్టణంలోని రెవెన్యూ విభాగంలో పని చేసే ఒక అధికారి బడా వ్యాపారికి కమర్షియల్ బిల్డింగ్‌ను డొమెస్టిక్‌గా రికార్డు చేసి మాముళ్లు తీసుకొని పన్ను కుదించారు. గతంలో నిధుల దుర్వినియోగంపై అప్పటి కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, డీఈఈలపై ఏసీబీ కోర్టు సెక్షన్ 420, 409 కింద కేసులు నమోదయ్యాయి. తప్పుడు రికార్డులతో నిధులు దుర్వినియోగం చేశారని అప్పటి కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి ఫిర్యాదు మేరకు విజిలెన్స్ అధికారులు విచారణ జరిపి ఏసీబీకి నివేదించడంతో ఏసీబీ కేసు నమోదు చేసింది. టెండర్ లేకుండా రూ.అరకోటి నిధులతో శానిటేషన్ మెటీరియల్ కొనుగోలుకు నిర్ణయించారు. 'ఆంధ్రజ్యోతి' ఈ విషయాన్ని వెలుగులోకి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఆ వెంటనే కలెక్టర్, డీఎంఎ కమిషనర్‌ను మందలించి మెటీరియల్ కొనుగోళ్లను రూ.20 లక్షలకు కుదించారు.

### కక్ష్య సాధింపుగా షోకాజ్ నోటీసులు

తాండూరు పట్టణంలోని కరీం కాలనీలో ఎప్పుడో నిర్మించిన ఇంటికి పర్మిషన్ జారీ చేసి అక్రమాలకు పాల్పడ్డారు. ఇటీవల హైకోర్టు ఆదేశాలను బేఖాతరు చేసి ప్రైవేటు ప్లాట్లు డ్రైనేజీ తవ్వినందుకు మాజీ కౌన్సిలర్ విజయదేవి రిట్ పిటిషన్ దాఖలు చేయడంతో ఆగ్రహించిన బల్దియా అధికారులు 16 ఏళ్ల కింద నిర్మించిన భవనం అక్రమమంటూ కక్ష్య సాధింపుగా షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మున్సిపాలిటీలో తమకు అనుకూలమైన సిబ్బందిని అనుకూలమైన చోట విధులు నిర్వహించేందుకు గాను పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారు. గతంలో తాండూరు మున్సిపాలిటీకి చెందిన జేసీబీని మరమ్మతు పేరిట హైదరాబాద్‌కు పంపించి ప్రైవేటు జేసీబీలతో పనులు చేయించుకొని బిల్లులు దండుకున్నారు. పట్టణంలో అక్రమ నిర్మాణాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. ఆస్తి పన్ను వసూళ్లలో కూడా వెనకబడి పోయింది. బల్దియా నిధులను మున్సిపాలిటీ ఆధునీకరణ పేరిట సుమారు రూ.అరకోటి దుబారా వ్యయం చేశారు. ఒక్క ఏడాదిలోనే రూ.25 కోట్ల నిధులను వినియోగించారు. సిబ్బందికి సకాలంలో వేతనాలు ఇవ్వకుండా నిధులన్ని అభివృద్ధి పనుల పేరిట వ్యయం చేశారు.

## ఘనంగా ప్రపంచ ఫొటోగ్రాఫర్స్ డే


కీసరలో లూయిస్ జాక్విన్ మాండ్ డాగురేకు నివాళులర్పిస్తున్న ఫొటోగ్రాఫర్లు

తాండూరు రూరల్, ఆగస్టు 19, (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం తాండూరు ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలో ఫొటో, కెమెరా సృష్టికర్త లూయిస్ ఆక్విన్ మాండ్ డాగురే చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఫొటోగ్రాఫర్లు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా తాండూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు శరణబసప్ప పలువురు ఫొటో గ్రాఫర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో నరేష్, షాబుద్దీన్, జగదీశ్వర్, దివ్య రాము, శరణు పాల్గొన్నారు.

**బొంరాస్‌పేట్:** ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం బొంరాస్‌పేట్‌లో ఫొటోగ్రాఫర్‌లు ఘనంగా జరుపుకున్నారు. స్థానిక ప్రభుత్వాసుపత్రి వైద్యుడు హేమంత్‌కుమార్ ఆధ్వర్యంలో గర్భిణులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్లు ప్రతాప్‌కుమార్, రవికుమార్, యాదవ్ పాల్గొన్నారు.

**కీసర:** శ్రీరామలింగేశ్వర ఫొటో, వీడియోగ్రఫీ అసోసియేషన్ అధ్వర్యంలో మంగళవారం జరిగిన ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా కీసన మండల ఫోటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు ఫొటోగ్రఫీ సృష్టికర్త చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు, పారిశుధ్య కార్మికులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు.

# వర్షాలకు పాడైన పంటల పరిశీలన


తాండూరు రూరల్: అంతారం సమీపంలో పెసర పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

తాండూరు రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): తాండూరు మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు 650ఎకరాల వరకు వివిధ పంటలు ముంపునకు గురైనట్లు తాండూరు వ్యవసాయ శాఖ ఇన్‌చార్జీ ఏడీ కొమరయ్య మంగళవారం తెలిపారు. మండలంలోని నదీ పరివాహక ప్రాంతంలో భారీవర్షాల వల్ల పంటలు మునిగిపోయినట్లు తెలిపారు. ప్రధానంగా పత్తి 128 ఎకరాలు, కంది 215ఎకరాలు, పెసర 100ఎకరాలు, మినుము 90ఎకరాలు, సోయాబీన్ 70ఎకరాలు, ముంపునకు గురైనట్లు తెలిపారు. మండలంలోని అంతారం తండాలో పంటను పరిశీలించగా కొంతమేరకు నష్టం వాటిల్లినట్లు తెలిపారు. ప్రధానంగా మండలంలోని ఐనెల్లి, చింతామణి పట్నం, ఎల్మకన్నె, చెనిగేష్‌పూర్, కోణాపూర్, గుంతబాస్పల్లి, మిట్టబాస్పల్లి, సంగెంకలాన్, గోనూరు, వీర్‌శెట్టిపల్లి, బిజ్వార్, బొంకూరు, ఖాంజాపూర్ తదితర ప్రాంతాల్లో ఎక్కువ పంటలు ముంపునకు గురై దెబ్బతిన్నట్లు తెలిపారు. మరో రెండు రోజుల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి సమగ్ర వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు నివేదించనన్నట్లు తెలిపారు.

## అధికారులు అప్రమత్తంగా ఉండాలి


పెద్దవాగు ఉధృతిని పరిశీలిస్తున్న ఎంపీడీవో విజయలక్ష్మి, తహసీల్దార్ రవీందర్

మోమిన్‌పేట్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు కురుస్తుండటంతో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో విజయలక్ష్మి, తహసీల్దార్ రవీందర్ అన్నారు. మండల కేంద్రంలోని పెద్దవాగు, నందివాగు ప్రాజెక్టు దిగువన లోతట్టు ప్రాంతాలైన కాస్లాబాద్, రాళ్లగూడుపల్లి వాగులను మంగళవారం పరిశీలించారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు చెరువులు, వాగులు, కుంటల దగ్గరికి వెళ్లరాదన్నారు. రామ్‌నాథ్ గూడుపల్లి సమీపంలోని అండర్ రైల్వే బ్రిడ్జి కింద వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుందని ఎవరూ వెళ్లరాదన్నారు. మోమిన్‌పేట్ మండల కేంద్రంలోని పెద్దవాగుకు ఇరువైపులా కట్టెలతో బారికెడ్లను ఏర్పాటు చేయించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సురేశ్, ఆర్ఐ గోవర్ధన్, సరిత, ఇరిగేషన్ సిబ్బంది శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు స్వప్న, రజిత, అన్నపూర్ణ, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

# ఎడతెగని వర్షంతో ధ్వంసమైన రోడ్లు


ధ్వంసమైన బీటీ లింకు రోడ్డు

మూడుచింతలపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీవర్షాలకు మూడుచింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని చెరువులు, వాగులు వంకలు పొంగి పొర్లుతున్నాయి. దీంతో వరద నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. లక్ష్మాపూర్ పెద్దచెరువు అలుగు పారి ఉధృతంగా నీరు ప్రవహిస్తుండడంతో లక్ష్మాపూర్ నుంచి కొట్టాలకు వెళ్లే బీటీ లింకు రోడ్డు ధ్వంసమై రాకపోకలు నిలిచిపోయాయి. చుట్టు పక్కల పంటపొలాలు నీట మునిగాయి. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు మరమ్మత్తులు చేసి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

**మోమిన్‌పేట్:** భారీ వర్షాలకు మండలంలోని ప్రధాన రోడ్లు గుంతలమయంగా మారాయి. మోమిన్‌పేట్ నుంచి శంకర్‌పల్లి, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్లే రోడ్లు కురుస్తున్న వర్షాలతో గుంతలమయంగా మారి వాహనదారులకు ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. మోమిన్‌పేట్ నుంచి చీమలదరి వరకు ఐదు కల్వర్టులను నిర్మించారు. ఆ కల్వర్టుల దగ్గర వాహనాలు రాకపోకలు కొనసాగించే సమయంలో నరకయాతన పడుతున్నారు. రోడ్డుపై గుంతలు ఏర్పడటంతో వరద నీరు నిలిచి ఇబ్బందులను కలిగిస్తుంది. ఎన్కతల, టేకులపల్లి, సదాశివపేట్, కోట్‌పల్లి, మొరంగపల్లి, ఎన్కెపల్లి, కాస్లాబాద్, టేకులపల్లి, సుద్దోడ్కుతండా వరకు రోడ్లు భారీ వర్షాలకు అధ్వానంగా మారాయి. రోడ్ల మరమ్మతులకు అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.


మోమిన్‌పేట్ నుంచి శంకర్‌పల్లికి వెళ్లే రోడ్డు దుస్థితి

# ముసిరిన వాన

(ఐదో పేజీ తరువాయి)

ధారూరు, పరిగి, చౌడాపూర్, కులకచర్ల మండలాల్లో భారీగా వర్షం కురిసింది. బషీరాబాద్, దౌల్తాబాద్, కొడంగల్, బొంరాస్‌పేట్, దోమ, తదితర ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం నమోదైంది.

గురుదొట్ల చెరువు కట్టకు గండి

జిల్లాలో కురిసిన భారీ వర్షానికి వాగులు పొంగిపొర్లడంతో పలు చోట్ల రాకపోకలు నిలిచిపోయాయి. ధారూరు, బంట్వారం, పెద్దేముల్, మోమిన్‌పేట్, వికారాబాద్. బొంరాస్‌పేట్ మండలాల్లో పలుమార్గాల్లో రాకపోకలు ఆగిపోయాయి. ధారూరు, బంట్వారం మండలాల్లో వాగులు ఉధృతిగా ప్రవహించడంతో ఉపాధ్యాయులు తమ విధులకు హాజరు కాలేకపోయినట్లు చెబుతున్నారు. వికారాబాద్ మండలంలో ద్యాచారం, గోధుమగూడ, గిరిగెట్‌పల్లి మార్గాల్లో ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జిల నుంచి వరద నీరు భారీగా ప్రవహించడంతో రాకపోకలు ఆగిపోయాయి. భారీ వర్షాలకు గురుదొట్ల చెరువు కట్టకు గండి పడింది. అధికారులు తాత్కాలికంగా మట్టి పోసి పూడ్చారు. బొంరాస్‌పేట్ మండల కేంద్రానికి మహంత్‌పూర్‌కు, తుంకిమెట్లకు మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. కక్రవాణి వాగు ఉగ్రరూపంతో ప్రవహించడంతో పరీవాహక ప్రాంతాల్లోని పంటలు నీట మునిగాయి. కాస్లాబాద్‌లోని నందివాగు ప్రాజెక్టు అలుగెత్తి ప్రవహించింది. జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పది వేల ఎకరాల వరకు పంటలు నీట మునిగాయి. పత్తి, మొక్కజొన్న, కంది, పసుపు పెసర, మినుము వంటి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. కురుస్తున్న భారీ వర్షాలకు ఏ మేరలకు నష్టం జరిగిందనేది తెలుసుకునేందుకు వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పంట పొలాలను పరిశీలించే పనిలో నిమగ్నమయ్యారు.


బషీరాబాద్: జీవన్గి ఎస్సీ కాలనీలో వరద

## సంక్షిప్తంగా..

### పెద్దేముల్ మండలానికి 1680 బస్తాల యూరియా

పెద్దేముల్: మండలానికి 1680 బస్తాలు యూరియా వచ్చింది. తట్టెపల్లి సొసైటీలో రెండు లారీలు(1120) బస్తాలు, పెద్దేముల్ సొసైటీకి ఒకలారీ (560)బస్తాలు వచ్చాయి. అయితే పెద్దేముల్ సొసైటీకి వచ్చిన లారీ ఆలస్యం కావడంతో యూరియాను పంపిణీ చేయలేదు. తట్టెపల్లి సొసైటీకి వచ్చిన యూరియా పంపిణీ ప్రారంభించిన గంటల వ్యవధిలోనే రెండులారీల యూరియా అయిపోయింది.

### మహాధర్నా వాల్ పోస్టర్ ఆవిష్కరణ

కీసర: సీపీఎస్ రద్దుచేయాలని కోరుతూ సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లో చేపట్టబోయే మహాధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ మండలంలోని ఉపాధ్యాయులు మంగళవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు.

### బీఎల్ఏలను నియమించాలి

కొడంగల్: పోలింగ్ బూత్‌ల వారీగా బీఎల్ఏలను నియమించుకోవాలని తహసీల్దార్ విజయ్‌కుమార్ సూచించారు. ఓటరు జాబితాపై వివిధ రాజకీయ పార్టీల నాయకులతో మంగళవారం భేటీ అయ్యారు.

## క్రైం కార్నర్

### విద్యుదాఘాతంతో మేకలు మృత్యువాత

- సుమారు రూ.లక్ష నష్టం


మేకల కళేబరాలు

కోట్‌పల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో మేకలు మృత్యువాతపడిన ఘటన కోట్‌పల్లి మండలంలోని బార్వాద్ గ్రామంలో చోటుచేసుకుంది. బాధిత రైతు ప్యాట పెంటయ్య తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెంటయ్య తనకున్న మేకలను ఇంటి వద్ద రేకుల షెడ్‌లో కట్టివేశాడు. మంగళవారం రాత్రి ఒంటి గంట సమయంలో మేకల అరుపులు వినపించడంతో వెళ్లి చూడగా షెడ్‌కు విద్యుత్ సరఫరా అయి తన చేతికి షాక్ వచ్చింది. దీంతో వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం ఇచ్చాడు. దీంతో విద్యుత్ సిబ్బంది కరెంటు సరఫరాను నిలిపి వేశారు. అనంతరం షెడ్‌లోకి వెళ్లిచూడగా అప్పటికే ఆరు మేకలు, రెండు పిల్లలు, ఒక కుక్క పడిపోయి ఉన్నాయి. ఈ విషయాన్ని ఉదయం విద్యుత్ అధికారులకు తెలపగా వారు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. స్థానిక తహసీల్దార్ శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేయగా కలెక్టర్ నిధుల నుంచి ఆర్థిక సాయం అందించేందుకు కృషి చేస్తానని చెప్పారు. మేకల మృత్యువాతతో తనకు సుమారు రూ.లక్ష వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకున్నాడు.

## రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దు


మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రైతులకు రుణమాఫీ చేయకుండా ప్రభుత్వం రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేయడం మానుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏనుగు సుదర్శన్ రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్‌లోని శివారెడ్డిగూడలోని అంజనేయస్వామి దేవాలయం వద్ద మంగళవారంజరిగిన రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం దాదాపు 20నెలల నుంచి రైతులకు రుణ మాఫీ చేయక పోవడం వలన రైతులు అప్పుల ఊబిలో కురుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం డైరెక్టర్లు లక్ష్మారెడ్డి, ధర్మారెడ్డి పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు హరినాథ్‌నెహ్రూ

కొడంగల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కందూరి రాంరెడ్డి లయన్స్ క్లబ్ కంటి ఆస్పత్రి మహబూబ్‌నగర్, కొడంగల్ లయన్స్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో ఆఫ్తాల్మిక్ వైద్యుడు హరినాథ్‌నెహ్రూ 50మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అందులో 14 మందిని ఆపరేషన్ కోసం మహబూబ్‌నగర్‌లోని కందూర్ రాంరెడ్డి ఆస్పత్రికి రెఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ క్లబ్ కార్యదర్శి భీమరాజ్, సంయుక్త కార్యదర్శి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్ అభివృద్ధికి పాలకవర్గం కృషి


మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి

మర్పల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మర్పల్లి మార్కెట్ అభివృద్ధికి పాలక వర్గం కృషిచేస్తుందని చైర్మన్ మహేందర్‌రెడ్డి అన్నారు. స్థానిక మార్కెట్ కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. మార్కెట్ అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.కోటితో షెడ్డు మంజూరైందని తెలిపారు. త్వరలోనే స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ చేతుల మీదుగా శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మల్లేశ్‌యాదవ్, సభ్యులు కృష్ణారెడ్డి, సుగ్రీవ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## మద్యం సేవించి వాహనాలు నడపొద్దు

మోమిన్‌పేట్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు వాహనదారులు నడపొద్దని ఎస్ఐ అరవింద్ అన్నారు. మండలంలో పోలీసుల తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడిపిన కుడుగుంట విజయ్, అరిగే ఉదయ్‌కుమార్ పట్టుబడినట్లు తెలిపారు. వీరిని వికారాబాద్ జిల్లా కేంద్రంలో న్యాయమూర్తి ముందు మంగళవారం హాజరుపర్చగా న్యాయమూర్తి మూడు రోజులు జైలు శిక్ష, రూ.3వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు తెలిపారు.

## పెండింగ్ వేతనం అందించాలి

దోమ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న జూలై నెల వేతనం అందించాలని ఆశావర్కర్లు నిరసన వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట నిరసన తెలిపి వైద్యురాలు రజితకు వినతిపత్రం అందజేశారు. పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలకనుగుణంగా వేతనాలు రూ.18వేలు అందించాలన్నారు.

## అవార్డు గ్రహీతలకు సన్మానం


ఎంపీడీవో, సూపరింటెండెంట్‌ను సన్మానిస్తున్న కార్యదర్శులు

మోమిన్‌పేట్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మోమిన్‌పేట్ ఎంపీడీవో విజయలక్ష్మి, సూపరింటెండెంట్ రాజమల్లయ్య ఈనెల 15న జిల్లా కేంద్రంలో కలెక్టర్ ప్రతీక్‌జైన్ చేతులమీదుగా ఉత్తమ అధికారులుగా ప్రశంసాపత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు వారిని ఎంపీవో యాదగిరితో కలిసి శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ మన్మోహన్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ హరీశ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్: మండలంలోని తుంకిమెట్ల గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎన్.రాజేశ్ ఉత్తమ కార్యదర్శిగా ఎంపికయ్యారు. ఇటీవలే జిల్లా కేంద్రంలో కలెక్టర్ చేతుల మీదుగా ఆయన ప్రశంసాపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం కాంగ్రెస్ నాయకులు ఆయనను శాలువాలతో సన్మానించారు.